

## రామాయణంలో భీముడు రాడూ!

మా అమ్మమ్మ వచ్చింది ఒకమాటు. ఆమెను యేడిపించటమంటే (!) నాకు బలేసరదా. ఆమెకు ఎంతసేపటికి సంసార జంజాటమేగాని, పురాణాలు, ప్రపంచజ్ఞానం తక్కువ. అట్లా అని పూర్తిగా తెలివితక్కువదిగాదు సుమా!

ఒకరోజు మా అమ్మ, అమ్మమ్మ పురాణానికి వెళ్ళివచ్చారు. రావటం తోనే "ఏం అమ్మమ్మా. ఇవాళేమిటి కథ" అన్నాను యదాలాపంగా "రామ వనవాసం చదివారురా" అన్నది.

"అయితే రామపాదుకలను భీముడు తీసుకవెళ్ళాడా! ఇంకాలేదా!" అన్నాను.

"ఆ! ఆ! భీముడు రావటం, రాముల వారిని ప్రాధేయపడి పాదుకలను తీసుకెళ్ళటం అయింది!" అన్నది. మేమంతా గొల్లుమన్నాము. "ఏంటట్లా అలా నవ్వుతారు" అన్నది బిక్క మొహంతో.

"ఏమిటే నీ బొంద! రామాయణంలో భీముడు వస్తాడుటే" అన్నది మా అమ్మ.

"అయితే రాడూ భీముడు రామాయణంలో! మరయితే ఎవరు వస్తారు" అన్నది అమాయికంగా!!

—బొడ్డుపల్లి కృష్ణావధాని.

## అమోనియా

ఈ సంఘటన నేను S. S. L. C. చదువుతున్నప్పుడు జరిగింది. మా సైన్సుమాష్టారు మమ్ములనందర్నీ ఒక ప్రక్క నవ్విస్తూ మరియొకప్రక్క ఏడిపించేవారు. అంటే చాల గమ్మత్తైన మాష్టారు. ఒకరోజున నోట్సు చెబుతున్నారు. మేము నిశ్శబ్దంగా వ్రాసుకుంటున్నాము. నోట్సు చెపుతున్న మాష్టారు ఒక్కసారి "అమ్మో" అన్నారు. మాష్టారికి ఏదో ప్రమాదం జరిగిందని అందరూ ఒక్కసారిగా మా మాష్టారిని చూచేము. వెంటనే మేష్టారు "నియా" అన్నారు. అందరమూ నవ్వలేక ఏడవలేక నోట్సులో లీనమైపోయాము. ఇంతకూ జరిగిందేమిటంటే అమోనియా గురించి నోట్సు చెపుతూ అమోనియాని "అమో" "నియా" గా విడదీసి మమ్మల నందర్నీ ఒక్క సారి సందిగ్ధంలో ముంచేసారు.

—చదరం బాబూరావు.

* * *

## రెడింక్ పేనా

మా క్లాసుటీచరు కాంపోజిషన్ కరక్షన్‌చేయుటకు, మమ్ములను నిశ్శబ్దముగా పాఠాలు చదువుకోమన్నారు. మా క్లాసులో రెడప్పరెడ్డి అనే పేరుగల వాడు ఉండేవాడు. మేమందరం రెడ్డి అని పిలిచేవారము. కాంపోజిషన్‌లో యెవరికి ఫస్టుమార్కులు వస్తాయో ఎవరికి తక్కువమార్కులు యిస్తాడో అని ఆత్రుతతో వున్నాము. ఇంతలో టీచరు రెడప్పవంక చూచి రెడింక్ పేనా ఉందిరా అని అడిగాడు. ఓ ఉంది సార్ అని పేనా పాకెట్‌నుండి తీసి యిచ్చాడు. టీచరు పేనాతో వ్రాసే సరికి బ్లాకింక్ పడింది. ఏమిరా బ్లాకింక్ పేనా యిచ్చావు? మీరడిగింది పేనానే గదసార్ అని రెడ్డి అనేసరికి మేమంత ఫక్కున నవ్వేశాము.

—తంగెళ్ల కేశవులురెడ్డి

* * *

## చంటిపాప

మద్రాస్ సెంట్రల్‌స్టేషనుకు ఒకడు బాగా త్రాగి, తనలాగే త్రాగిన ఇంకొకడిని చేతులతో చంటిపాపలాగ మోసుకు వచ్చి బెంగుళూరుకు ఒకటిక్కట్టు ఇవ్వమన్నాడు. అప్పుడు టిక్కెట్టు అమ్మే గుమస్తా "నీవు చేతులతోమోసే నీ స్నేహితునకు టిక్కెట్టు అవసరంలేదా" అన్నాడు.

త్రాగుబోతు:—వాడు నా స్నేహితుడు కాదే. వాడు నా చిన్నకొడుకు అయిదు సంవత్సరాల వయస్సుంటుంది."

రైలు గుమస్తా:—అయిదు సంవత్సరాలా ఎంతచిత్రం, అధమం ఆరడుగులయిన పొడుగుంటాడు. బరువు రెండు వందల పౌనుల బరువుంటాడు. రామదాసంత గెడ్డంవుంది. ఎలాగ అతనికి అయిదుసంవత్సరాల వయస్సనుకోవటం.

త్రాగుబోతు:—(రెండవవాడిని చేతులలోంచి క్రిందకుదింపి కోపంతో!) "ఒరి తాగుబోతువెధవా! గెడ్డం గీయించుకరారా" అంటే నామాట విన్నావూ.

—మేడేపల్లి రమణమూర్తి.★